బాసర ఐఐఐటీని పరిశీలించిన భావేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 26: నిర్మల్ జిల్లా బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు భౌతిక తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సోమవారం బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించిన జిల్లా కలెక్టర్.. గోదావరి నది వద్ద ఉన్న నీటి సరఫరా ఇంటెక్ వెల్, మోటార్లు, ఐఐఐటీ ప్రాంగణంలోని నీటి నిల్వ కుంట, పంపుహౌస్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించి నీటి సరఫరా పరిస్థితిని తెలుసుకున్నారు.

రోజుకు 15 లక్షల లీటర్ల నీటి అవసరం

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిపి సుమారు 10 వేల మంది వరకు ఉంటారని, వారి తాగునీరు, ఇతర రోజువారీ అవసరాలకు రోజుకు సుమారు 15 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని కలెక్టర్ వివరించారు. గోదావరి నది వద్ద ఐఐఐటీకి నీటిని సరఫరా చేసేందుకు 60 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లు ఉండగా, ప్రస్తుతం ఒకటి మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తోందని తెలిపారు.పనిచేయని రెండు మోటార్ల మరమ్మతుల కోసం రూ.8 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ఇప్పటికే సాంకేతిక నిపుణుల బృందం ఇంటెక్ వెల్‌ను పరిశీలించిందని, పది రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి మోటార్లను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న మోటారు రోజుకు సుమారు 25 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయగల సామర్థ్యం కలిగి ఉందని వివరించారు.

ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి

భవిష్యత్తులో పెరిగే నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరో కొత్త మోటారును ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైతే గ్రామపంచాయతీ ఇంటెక్ వెల్ ద్వారా నీటిని సరఫరా చేయడంతో పాటు, గ్రామపంచాయతీ ట్యాంకర్లను కూడా వినియోగిస్తామని పేర్కొన్నారు.ఐఐఐటీ ప్రాంగణంలో సుమారు 29 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నీటి నిల్వ కుంటను శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రస్తుతం నీటి లభ్యతలో ఇబ్బంది లేదని, ప్రధానంగా సరఫరా వ్యవస్థలో ఉన్న సమస్యలను పరిష్కరించాల్సి ఉందని స్పష్టం చేశారు.

భౌతిక తరగతుల ప్రారంభానికి చర్యలు

విద్యార్థులకు రోజువారీ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో భౌతిక తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం నీటి సరఫరా మోటార్లకు అవసరమైన పరికరాలను వెంటనే తెప్పించి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, గ్రిడ్ డీఈఈ, ఈఈలు రాజేశ్వర్ రావు, రాఘువేంద్ర రెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఐఐఐటీ డీన్లు మహేష్, విఠల్, విద్యార్థి సంక్షేమ అధికారి నాగరాజు, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ ధర్నాకు బయలుదేరిన ముదిగొండ మండల గ్రామ పంచాయతీ వర్కర్స్

ముదిగొండ మండలం అక్టోబర్ 26 వాయిస్ టుడే : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి ముదిగొండ మండల గ్రామ పంచాయతీ వర్కర్స్ సీఐటీయూ (జ×ఖ) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి/సోమవారం ఉదయం భారీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలలో రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు తీర్చేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులతో పాటు ముదిగొండ మండల పరిధిలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు.

న్యూ లక్ష్మీపురంలో ఘనంగా ‘ఖేత్ బచావో అభియాన్’ నిర్వహణ

ముదిగొండ మండలం అక్టోబర్ 26 వాయిస్ టుడే : ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామం పమ్మి క్లస్టర్‌లో నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఎరువులను సమతుల్యంగా వాడటం మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం వంటి ప్రధాన లక్ష్యాలతో ‘ఖేత్ బచావో అభియాన్’ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. అక్టోబర్ 22 నుండి నవంబర్ 30, 2026 వరకు కొనసాగే ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో ఏఈవో ఇందు భవాని, సర్పంచ్ సలీమా ఖాసీం, పంచాయతీ కార్యదర్శి సురేష్,వార్డు మెంబర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మరియు అనుబంధ శాఖల చైర్మన్లు ఉత్సాహంగా పాల్గొని రైతులకు వ్యవసాయ వనరుల సక్రమ వినియోగంపై అవగాహన కల్పించారు.

సోన్ మండలంలోని పుష్కర ఘాట్‌ల అభివృద్ధికి 3.72 కోట్ల నిధులు మంజూరు

శ్రీహరిరావుకి కృతజ్ఞతలు తెలిపిన సోన్ మండల కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 26 నిర్మల్ జిల్లా (సోన్) రాబోయే ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం మరియు మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం భారీగా నిధులను విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా, సోన్ మండలంలోని పుష్కర ఘాట్‌ల శాశ్వత అభివృద్ధి పనుల కొరకు రూ. 3 కోట్ల 72 లక్షల భారీ నిధులను మంజూరు చేయడం జరిగింది. ఈ నిధుల మంజూరుకు ప్రత్యేక కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరి రావు కి సోన్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇటీవలే విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వుల (G.O. Rt No: 582, తేది: 22.09.2026) ప్రకారం... గోదావరి పుష్కరాల టైర్-2 (Tier-II) శాశ్వత పనుల కింద సోన్ మండల పరిధిలో కింది అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు:

రూ. 91 లక్షలు: సోన్ బస్ స్టాండ్ నుండి మెండోరా మండల పరిధిలోని స్వామి మఠం మీదుగా గోదావరి పుష్కర ఘాట్-1 వరకు రోడ్డు పునరుద్ధరణ (R/F) పనులకు.

రూ. 100 లక్షలు (1 కోటి): సోన్ గ్రామ ప్రవేశ ద్వారం నుండి పాత బ్రిడ్జి మీదుగా పుష్కర ఘాట్-1 వరకు రోడ్డు నిర్మాణానికి.

రూ. 80 లక్షలు: జాతీయ రహదారి (చీఎ-44) నుండి సోన్ గ్రామంలోని గోదావరి పుష్కర ఘాట్-2 వరకు రోడ్డు పునరుద్ధరణ పనులకు.

రూ. 38 లక్షలు: సోన్ గ్రామ పంచాయతీ భవనం నుండి స్వామి మఠం మీదుగా గోదావరి పుష్కర ఘాట్-1 వరకు రోడ్డు పునరుద్ధరణ పనులకు.

రూ. 63 లక్షలు: సోన్ మండల పరిధిలోని సోన్ ఆర్ అండ్ బి (R&B) రోడ్డు నుండి కూచన్‌పల్లి గ్రామం వరకు రోడ్డు పునరుద్ధరణ పనులకు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సోన్ మండల అధ్యక్షుడు మొయినుద్దీన్ మాట్లాడుతూ... రాబోయే పుష్కరాలకు దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి శ్రీహరి రావు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ నిధులను సాధించారని కొనియాడారు. ఈ నిధులతో సోన్ మండలంలోని పుష్కర ఘాట్‌ల రూపురేఖలు మారనున్నాయని, ఇంతటి భారీ నిధులు మంజూరు చేయించినందుకు జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

“అనంతుల” కుటుంబానికి తప్పక న్యాయం చేస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 26 : ఇటీవల ఆత్మహత్య కి పాల్పడిన అధికారి అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి తప్పక న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చినట్లు పద్మశాలి సంక్షేమ సంఘం ఒక ప్రకటన లో తెలిపింది. చుంచుపల్లిలో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆద్వర్యం లో మంత్రి నీ కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై బాధితులతో మాట్లాడి కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చారు. ఎస్పీ రోహిత్ రాజు కు ఫోన్ చేసి అనంతుల లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారని అనంతుల కుటుంబ సభ్యులు తెలిపారు. నిందితులు ఎంతటి వారైనా వారి వెనుక ఎవరున్నా గాని వదిలిపెట్టకుండా సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మంత్రి సివిల్ సప్లై కమిషనర్ తో సైతం మాట్లాడి కుటుంబానికి ఏ రకమైన ఉపాధి అవకాశాలను అందించా లో పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. బాధితులకు ఎటువంటి గృహ సదుపాయం లాంటివి లేవని తెలుసుకొని వారికి స్థలాన్ని ఇంటిని మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందించే విధంగా ఎక్స్‌గ్రేషియాను కూడా పరిశీలిస్తామని అన్నారు. నిందితులైన జర్నలిస్టులకు సంబంధించి వారి అక్రిడేషన్లు రద్దు చేస్తామని అక్రిడేషన్లో కమిటీ లో ఉన్న వారిని సైతం మీడియా పరంగా పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు ఎర్రగుంట సాంబశివరావు, గుండు రవికుమార్, ఇమంది ఉదయ్ కుమార్, పిండిపోలు కన్నయ్య బొమ్మ రామ కిషోర్, వేముల సతీష్, కేదాసి నవీన్, శ్రీనివాస్, శివకుమార్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా అక్టోబర్-26 వాయిస్ టుడే: పోక్సో చట్టం పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. సోమవారం పాన్ ఇండియా సురక్షిత్ బచపాన్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ హైస్కూల్ బాలికల లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల ఇరవై ఆరవ తేదీ నుంచి ముప్పై ఒకటి వరకు పోక్సో చట్టం పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పద్దెనిమిది సంవత్సరాల లోపు బాల బాలికలకు పోక్సో చట్టం వర్తిస్తుందని, చట్టంలో పొందుపరిచిన అంశాల ఆధారంగా బాల బాలికలకు రక్షణ ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియా పట్ల అమ్మాయిలు అప్ర మత్తంగా ఉండాలని, అపరిచితుల వలలో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికలకు ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే మండల న్యాయ సేవాధికార సంస్థ సంప్రదించినట్లయితే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధా న కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయ వాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, బొయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వేము ల స్నేహ, స్కూల్ ప్రిన్సిపాల్ దివాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో మరింత ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజల మధ్య అన్యోన్యత, సోదరభావం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం తొలగిపోయి, సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ప్రకృతి అనుకూలించి రాష్ట్రాలు పాడిపంటలతో కళకళలాడాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని వేడుకున్నారు.

ఐకేపీ వీవోఏలకు రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలి

ఝరాసంగం మండల ఐకేపీ వీవోఏల సంఘం కోశాధికారి విజయ్ కుమార్

ఇందిరా పార్క్ ధర్నాలో పాల్గొన్న ఝరాసంగం మండల వీవోఏలు

జహీరాబాద్ వాయిస్ టుడే అక్టోబర్ 26: ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఝరాసంగం మండలానికి చెందిన ఐకేపీ వీవోఏలు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝరాసంగం మండల ఐకేపీ వీవోఏల సంఘం కోశాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వీవోఏల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న వీవోఏలను పర్మినెంట్ చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వీవోఏలు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, పని భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీవోఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో ఝరాసంగం మండలానికి చెందిన పలువురు ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.